సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

7

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి వద్ద పొంగి ప్రవహిస్తున్న వెంకమ్మ చెరువు

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్ర కూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

48 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



జేవీఆర్ ఓసీలో భారీగా చేరిన వర్షపు నీరు

సింగరేణి(కొత్తగూడెం): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సింగరేణి ఓసీల్లో వరద నీరు చేరుతోంది. దీంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లుతోంది. కొత్తగూడెం రీజియన్ పరిధిలో(ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ఏరియాలు) కీలకమైన ఐదు ఓసీల్లో రోజుకు 78 వేల టన్నుల బొగ్గు వెలికి తీయాల్సి ఉండగా, ప్రస్తుతం 30 వేల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. ఇక సింగరేణి వ్యాప్తంగా రోజుకు సమారు 16 లక్షల ఓవర్ బర్డెన్ (ఓబీ) తీయాల్సి ఉండగా, ఈ రెండు రోజుల్లో కనీసం 4 లక్షల ఓబీ కూడా వెలికి తీయలేదు.

నేడు పాఠశాలలకు సెలవు

కొత్తగూడెంఅర్బన్: కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో పాఠశాలల్లో నీరు నిల్వ ఉండడం, ఆవరణలు బురదమయం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. అన్ని పాఠశాలల వారు తప్పని సరిగా పాటించాలని సూచించారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు.

2,982 ఎకరాల్లో నష్టం



పాల్వంచ మండలం నాగారంలో నీట మునిగిన వరి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో 984 మంది రైతులకు చెందిన 2,982 ఎకరాల్లో పంటల నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం ప్రకటించారు. ప్రధానంగా పత్తి, వరి పంటలు నీట మునిగాయి. వర్షాలు ఇలాగే కొనసాగితే పత్తికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. వరి పంటలు సైతం కుళ్లిపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం జూలూరుపాడు మండలంలో 368 ఎకరాలు, పాల్వంచ మండలంలో 120 ఎకరాలు, అశ్వాపురం మండలంలో 700 ఎకరాలు, బూర్గంపాడు మండలంలో 1,190 ఎకరాలు, మణుగూరు మండలంలో 604 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వరి పంట మొత్తంగా 565 మంది రైతులకు సంబంధించిన 1,647 ఎకరాలు, పత్తి పంట 414 రైతులకు సంబంధించిన 1,325 ఎకరాల్లో నీట మునిగింది.

నిబంధనల శరాఘాతం

ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా పంటలు ధ్వంసమైతే ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతులకు నష్టం కలిగిస్తున్నాయి. 33 శాతం కంటే తక్కువ పంట నష్టం జరిగితే పరిహారానికి అర్హత ఉండదు. చిన్న, సన్నకారు రైతులకు ఈ నిబంధన తీవ్ర నష్టం కలిగిస్తుందని రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

వరుణాగ్రహం..

గత రెండు రోజులుగా వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికలు నిజమయ్యాయి. జిల్లాలో ఊహించిన దానికంటే ఎక్కువ విపత్తే చోటు చేసుకుంది. భారీ వర్షాలతో అశ్వాపురం మండలంలో ఇద్దరు పశువుల కాపర్లు, మణుగూరులో ఓ దివ్యాంగుడు చనిపోగా, వందలాది మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు వేల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. చేలల్లో ఇసుక మేటలు వేశాయి. వరదల ధాటికి వ్యవసాయ బావుల వద్ద మోటార్లు, పరికరాలు కొట్టుకుపోయాయి. –సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

మణుగూరు మునక.. కిన్నెరసాని కన్నెర్ర

- గోదావరి తీరంలో కురిసిన అతి భారీ వర్షాలు
- జిల్లా వ్యాప్తంగా ఉప్పొంగిన వాగులు
- వర్షాలతో ముగ్గురు మృత్యువాత
- నేడు కూడా జిల్లాకు పొంచి ఉన్న వాన గండం

ముందస్తుగానే హెచ్చరికలు..

రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు జిల్లాల్లో అత్యంత భారీ నుంచి ప్రమాదకర స్థాయి వరకు వర్షాలు కురిసే అవకాశముందని శనివారం మధ్యాహ్నమే వాతావరణ శాఖ నుంచి హెచ్చరించింది. 24 గంటల వ్యవధిలో ఒక ప్రాంతంలో 25 సెంటీమీటర్లకు మించి వర్షపాతం నమోదైతే అత్యంత భారీ లేదా ప్రమాదకర వానగా గుర్తిస్తారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు మణుగూరులో అత్యధికంగా 31.64 సెం.మీ. వర్షం కురిసింది. ఆ తర్వాత బూర్గంపాడులో 28 సెం.మీ, భద్రాచలంలో 25 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో మణుగూరు, బూర్గంపాడు మండలాల్లో జనజీవనం అతలాకుతలం కాగా పెద్ద మొత్తంలో ప్రాణ, ఆస్తి నష్టం నమోదైంది.

నెమ్మదించిన వాన..

ఆదివారం భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసినప్పటికీ ఉదయం 8:30 గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు తగ్గుముఖం పట్టాయి. అత్యధికంగా చంద్రుగొండలో 3.28 సెంటీమీటర్ల వర్షపాతమే నమోదైంది. మణుగూరులో ఒక సెంటీమీటర్ లోపే వాన కురిసింది. దీంతో క్రమంగా పరిస్థితి అదుపులోకి వచ్చింది. లేదంటే దారుణంగా మారేది. వాన తెరిపినివ్వడంతో జిల్లా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమైంది. భారీ వర్షంతో నీట మునిగిన మణుగూరులో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ పర్యటించారు. ముంపు బాధితులను శిబిరాలకు తరలించారు. సహాయ కార్యక్రమాల కోసం అప్పటికప్పుడు పుట్టిని అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత భద్రాచలంలో గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. రోడ్లపైకి నీరు ప్రవహిస్తుండటంతో ప్రమాదకర చోట్ల ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించారు.

తొలగని ముప్పు

జిల్లాలో సోమవారం భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా చెరువులు నిండుకుండలా మారాయి. దీంతో మరోసారి భారీ వానలు వస్తే తిప్పలు తప్పవు. ముఖ్యంగా అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువు పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. దాదాపు ఒక టీఎంసీ నీటి సామర్థ్యం గల ఈ చెరువు కింద పది వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే అలుగు పారే సామర్థ్యం తక్కువగా ఉండడంతో ఇబ్బందికరంగా మారింది. మరోసారి క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షం కురిస్తే కట్ట తెగిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే సీతారామ ట్రంక్ కెనాల్‌తో పాటు చుట్టుపక్కల పది గ్రామాలు మునిగిపోయే ప్రమాదం నెలకొంది.



మణుగూరులోని సుందరయ్య నగర్‌లో వరద ముంపునకు గురైన ఇళ్లు

కమ్మేసిన ముసురు..

24 గంటల వ్యవధిలో 12 సెం.మీ నుంచి 25 సెం.మీ. మధ్య వర్షం కురిస్తే అతి భారీ వర్షంగా పేర్కొంటారు. జిల్లాలో 23 మండలాలు ఉంటే అందులో 13 మండలాల్లో అత్యంత భారీ వానలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పదుల సంఖ్యలో చెరువులు ప్రమాదకర పరిస్థితుల్లో అలుగు పోస్తున్నాయి. కొన్ని చోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. వరద కారణంగా సీతారామ ప్రధాన కెనాల్‌కు పాల్వంచ మండల పరిధిలో గండి కొట్టారు. కిన్నెరసాని ప్రాజెక్టు 12 గేట్లు ఎత్తి లక్ష క్యూసెక్కులకు పైగా వరదనీటిని కిందికి వదిలారు. తాలిపేరు నుంచి 40 వేల క్యూసెక్కుల వరద గోదావరిలో కలుస్తోంది. మరోసారి పెదవాగుకు వరద రావడంతో నిర్మాణంలో ఉన్న రింగ్‌బండ్ కొట్టుకుపోయింది. ముసురుకున్న మబ్బులతో జిల్లా వ్యాప్తంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.

పంట నష్టం వివరాలు

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)
జూలూరుపాడు	368
పాల్వంచ	120
అశ్వాపురం	700
బూర్గంపాడు	1,190
మణుగూరు	604
మొత్తం	2,982

అత్యధిక వర్షంపాతం నమోదైన మండలాలు (శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు)

మండలం	వర్షపాతం (సెం.మీ.)
మణుగూరు	31.64
బూర్గంపాడు	28.78
భద్రాచలం	25.52
పాల్వంచ	23.70
అశ్వాపురం	21.90

ఆదివారం ఉదయం 8:30 తర్వాత అత్యధిక వర్షపాతం నమోదైన మండలాలు

చంద్రుగొండ	3.28
గుండాల	2.50
దమ్మపేట	1.43
మణుగూరు	0.95
టేకులపల్లి	0.88



మణుగూరులో ఇళ్ల నుంచి సామగ్రి తరలిస్తూ..



ముంపు బాధితులను తరలిస్తున్న రెస్క్యూ సిబ్బంది



బూర్గంపాడు మండలంలో దెబ్బతిన్న పత్తి చేను



మణుగూరులో పర్యటిస్తున్న కలెక్టర్ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్



గుండాల: మర్కోడులో ఇంట్లోకి చేరిన నీరు

పెరుగుతూ.. తగ్గుతూ..

- భద్రాచలం వద్ద 31 అడుగులకు చేరుకున్న గోదావరి
- వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్

భద్రాచలంఅర్బన్ : జిల్లాతో పాటు రాష్ట్రంలోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరిలోకి వరద పెరుగుతోంది. దీంతో ఒక్కసారిగా 8.6 అడుగుల మేర పెరిగిన నీటిమట్టం ఆదివారం సాయంత్రం 5 గంటలకు కొంతమేర తగ్గింది. శనివారం రాత్రి 9 గంటలకు 23.30 అడుగులు ఉండగా, 11 గంటలకు 23.50, ఆదివారం ఉదయం 7 గంటలకు 29.80, 9 గంటలకు 30.80, 10 గంటలకు 31.30, 11 గంటలకు 31.70, మధ్యాహ్నం 12 గంటలకు 31.90 అడుగులకు చేరుకుంది. కాసేపు నిలకడగా ఉన్న గోదావరి.. తిరిగి తగ్గుముఖం పట్టింది. మధ్యాహ్నం 2 గంటలకు 31.70 అడుగులకు చేరుకుని, క్రమంగా తగ్గుతూ రాత్రి 9 గంటలకు 29.90 అడుగులకు చేరింది. కలెక్టర్ జితేష్ వి పాటిల్ గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. కరకట్ట ప్రాంతంలోని విస్తా కాంప్లెక్స్‌ను సందర్శించి, పట్టణ ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. వర్షపు నీటి కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.



వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్.వి.పాటిల్

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ పర్యటన

మణుగూరుటౌన్/చంద్రుగొండ/కొత్తగూడెంటౌన్ : కొత్తగూడెం పట్టణంతో పాటు మణుగూరు, చంద్రుగొండ మండలాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి పలు ఇళ్లు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. కాగా ఆదివారం ఉదయం కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ మణుగూరులోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ముంపునకు గురైన లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించగా, రెస్క్యూ టీం, పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది కలిసి 30 కుటుంబాల వారిని ఎగువ ప్రాంతాలకు తరలించారు.



సీతాయిగూడెం వద్ద వాగు వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజ్ సూచించారు. చంద్రుగొండ శివారు తిప్పనపల్లి వాగును, డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఆదివారం ఆయన పరిశీలించారు. సీతాయిగూడెం వద్ద ఎదుల వాగు చప్టాపై వరద ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపివేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. దీంతో సీఐ ఇంద్రసేనారెడ్డి బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించే ప్రక్రియ చేపట్టారు. సీతాయిగూడెంలోని వెంగళరాయ సాగర్ అలుగు గండిని ఐబీ ఈఈ అర్జున్ పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని పాత కొత్తగూడెం–పెనుబల్లి, గోదుమవాగు ప్రాంతాలను కూడా ఎస్పీ పరిశీలించారు.

'సీతారామ' ప్రధాన కాలువకు గండి

ములకలపల్లి/పాల్వంచరూరల్ : సీతారామ ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువకు ఆదివారం తెల్లవారుజామున భారీ గండి పడింది. ములకలపల్లి, పాల్వంచ మండలాల సరిహద్దులో కొత్తూరు గ్రామ శివారులో ముర్రేడు అక్విడెక్ట్‌కు సమీపంలో 38.5 కిలోమీటర్ వద్ద కాలువ కోతకు గురై గండి పడడంతో దిగువకు నీళ్లు పరవళ్లు తొక్కాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు కాలువ ఎగువ భాగంలోని చెరువుల అలుగు నీళ్లు కూడా కాల్వలోకి రావడంతో పూర్తిగా నిండి, పొంగిపొర్లింది. సిమెంట్ లైనింగ్ కూడా పగిలింది. కాగా ప్రవాహ ఉధృతికి సమారు 100 ఎకరాల్లో పత్తి, వరి, మొక్కజొన్న, జామాయిల్ తదితరుల పంటలు దెబ్బతిన్నట్లు స్థానికులు చెబుతున్నారు, కాగా గండి పడిన ప్రదేశాన్ని పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ సందర్శించారు. ప్రధాన కాలువ వరద ప్రవాహనం పూసుగూడెం శివారులోని పంప్‌హౌస్ –2 చేరితే భారీ భారీ నష్టం వాటిల్లేది. దీంతో అధికారులు గండి కొట్టేందుకు ప్రయత్నించారు. ఈలోగా ఇదే ప్రదేశానికి అత్యంత సమీపంలోనే కాలువ కోతకు గురై గండి పడింది. కాగా, గత ఆగస్టు 15వ తేదీనే సీతారామ కెనాల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించగా, అప్పుడే గండి పడడం గమనార్హం.



సీతారామ కాలువకు పడిన గండి

విద్యార్థులను జాగ్రత్తగా చూడాలి



మణుగూరులో విద్యార్థులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడుతున్న పీఓ రాహుల్



భద్రాచలంలో ప్రహరీ కూలిన పాఠశాల వద్ద అధికారులతో మాట్లాడుతున్న పీఓ

హెచ్‌ఎం, హాస్టల్ వార్డెన్లకు పీఓ ఆదేశం

భద్రాచలంఅర్బన్/మణుగూరుటౌన్ : వర్షాలు జోరుగా కురుస్తున్నందున ఆశ్రమ పాఠశాల, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల విషయంలో హెచ్‌ఎంలు, వార్డెన్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలెవరూ బయటకు వెళ్లకుండా చూడాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆదివారం భద్రాచలంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలోని ప్రహరీ కూలింది. విషయం తెలియగానే ఏఎస్పీ అంకిత్ కుమార్‌తో కలిసి పీఓ ఆ పాఠశాలకు వెళ్లి వివరాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. పాఠశాలలో విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులు సక్రమంగా ఉన్నాయా పరిశీలించాలని హెచ్‌ఎంకు సూచించారు. ఆ తర్వాత పీఎంహెచ్ వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వార్డెన్‌కు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుభద్ర, పీఎంహెచ్ పాఠశాల వార్డెన్ అనిత, వెంకట్, డీఈ హరీష్, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆ తర్వాత పీఓ మణుగూరులో పర్యటించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షంతో మండలంలోని బాలాజీనగర్, శేషగిరినగర్, ఆదర్శనగర్, మామిడిచెట్ల గుంపు, సుందరయ్యనగర్, వినాయకనగర్, అశోక్‌నగర్, చాకలి ఐలమ్మ నగర్ శివారు ప్రాంతాలు నీట మునిగాయి. మణుగూరులోని ఎస్టీ బాలుర హాస్టల్ భవనంలో 120 మంది విద్యార్థులు చిక్కుకుపోయారు. దీంతో పీఓ రాహుల్ వారితో వీడియో కాల్ ద్వారా మాట్లాడి ధైర్యం చెప్పారు. భవనంలోని రెండో ఫ్లోర్‌లో ఉండాలని సూచించారు. ఎగువ ప్రాంతాలకు రావడానికి ఇబ్బంది కలగడంతో ఐటీడీఏ పీవో రాహుల్ వారితో ఫోన్‌లో వీడియో కాల్ మాట్లాడి జాగ్రత్తలు చెప్పారు. ఆయన వెంట ఆర్డీఓ దామోదర్, డీడీ మణెమ్మ తదితరులు ఉన్నారు.

వరద సహాయక చర్యల్లో ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంవన్‌టౌన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఖమ్మం మున్నేరు, లకారం పరిసర ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఉదయం నుండి ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షించారు. ఆయా ప్రాంతాల్లో వరద ప్రభావాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్‌లో తెలిపారు. అలాగే, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై ఆరా తీశారు. ఖమ్మంలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, జూబ్లీక్లబ్, కాల్వొడ్డు, పాలేరు నియోజకవర్గంలోని కరుణగిరి, జలగంనగర్, నాయుడుపేట, రాజీవ్ గృహకల్ప, పోలెపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడిన ఎంపీ.. వీలైనంత త్వరగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

సీపీఎస్‌ను రద్దుచేయాలి

ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలనే డిమాండ్‌తో జిల్లా ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహించి, పోస్టాఫీస్ సెంటర్‌లో మానవహారం నిర్మించారు. తొలుత పాత బస్‌డిపో వద్ద ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ సెంటర్‌లోని తెలంగాణ అమర వీరుల స్థూపం వరకు సాగింది. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ అమరనేని రామారావు, జనరల్ సెక్రటరీ సంగం వెంకటపుల్లయ్యతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకుల మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామని అప్పటి ప్రతిపక్ష, ఇప్పటి అధికారపక్ష నాయకులు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తాము దాచుకున్న సొమ్ములో 60 శాతం ఇచ్చి మిగతా సొమ్ముతో పెన్షన్ ఇస్తామనడం ప్రభుత్వ ఉద్యోగులను మభ్యపెట్టడమే అవుతుందన్నారు. ఉద్యోగులు జమ చేసిన డబ్బును షేర్ మార్కెట్‌లో పెట్టడం అంటే తమ సొమ్ముతో వ్యాపారం చేసినట్లేనని అన్నారు. రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, హరియాణా, పంజాబ్ రాష్ట్రాలు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినట్టుగా చట్టాలు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కంచర్ల సాయిభార్గవ్ చైతన్య, రాజు, కృష్ణయ్య, డి.వెంకటేశ్వర్లు, రవి, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్, పుల్లయ్య, జాస్తి రమేష్‌బాబు, మోహన్, బాలకృష్ణ, మంగీలాల్, కిరణ్, వంశీ, ఉషారాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

క్లుప్తంగా

తాలిపేరు ప్రాజెక్ట్ 25 గేట్లు ఎత్తివేత



తాలిపేరు నుంచి విడుదలవుతున్న వరదనీరు

చర్ల: ఎగువ ప్రాంతాల నుంచి తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ఆదివారం ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లను ఎత్తివేసి 40,962 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో వరద నీరు తాలిపేరులోకి వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని నీటిమట్టాన్ని 70.95 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నట్లు డీఈ తిరుపతి తెలిపారు.

శభాష్.. తహసీల్దార్



మృతదేహాన్ని అంబులెన్స్‌లో పోస్టుమార్టం నిమిత్తం తరలిస్తున్న తహసీల్దార్ రాఘవరెడ్డి

మణుగూరు టౌన్: మణుగూరు పట్టణం పూర్తిగా ముంపునకు గురి కావడంతో దివ్యాంగుడు నందికొళ్ల రాము(29) మృతి చెందాడు. వరద నీటిలో నుంచి మృతదేహాన్ని ఎలా తీసుకురావాలో తెలియక రోదిస్తున్న తల్లి మనోవేదనను సోషల్‌మీడియా ద్వారా తెలుసుకున్న తహసీల్దార్ రాఘవరెడ్డి స్పందించారు. అప్పటికే వరద సహాయక చర్యల్లో ఉన్న ఆయన సుందరయ్యనగర్- లెనిన్ నగర్ ప్రాంతానికి చేరుకున్నాడు. మృతుడి తల్లి రత్నంతో కలిసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తన భుజాలపై మోసి అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జీఓ 2 ప్రకారం బాధితుడికి ప్రభుత్వం నుంచి రూ.4 లక్షల పరిహారం అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను పలువురు అభినందించారు.

వాగులో వ్యక్తి గల్లంతు...



సైదులు పాషాను కాపాడుతున్న స్థానికులు

ఇల్లెందు: ఇల్లెందు మంచినీటి చెరువు అలుగు వాగులో ఆదివారం ఓ వ్యక్తి గల్లంతు కాగా, స్థానికులు కాపాడారు. ఇల్లెందు–సత్యనారాయణపురం మధ్య లోలెవల్ కాజ్‌వే మీదుగా అలుగువాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా సత్యనారాయణపురానికి చెందిన సైదులుపాషా బైక్‌తో వాగు దాటే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో బైక్‌తో సహా కొట్టుకుపోయాడు. ఓ చోట చెట్టు కొమ్మలు పట్టుకుని పైకి ఎక్కాడు. అప్పటికే అక్కడున్న స్థానికులు, పోలీసులు తాళ్ల సహాయంతో అతన్ని కాపాడారు. వరద నీటి నుంచి బయట పడటంతో కుటుంబ సభ్యులు, సత్యనారాయణపురం వాసులు ఊపిరి పీల్చుకున్నారు. బైక్ మాత్రం కొట్టుకుపోయింది.

వ్యక్తిపై కేసు నమోదు

సుజాతనగర్: ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన ఓ వ్యక్తిపై సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్సై జుబేదాబేగం కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డికి సంబంధించిన ఫ్లెక్సీలను డేగలమడుగు గ్రామానికి చెందిన నరసింహారావు ధ్వంసం చేశాడు. కాంగ్రెస్ కార్యకర్త మండె రవీందర్ ఫిర్యాదు మేరకు నరసింహారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

సుజాతనగర్: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటనపై సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్సై జుబేదాబేగం కథనం ప్రకారం... సీతంపేట బంజర గ్రామానికి చెందిన నూనావత్ నాగేశ్వరరావు(33) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మతిస్థిమితం కోల్పోయి న ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'సింగరేణి' పరీక్షకు 113 మంది హాజరు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 10 మెకానికల్ అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ పోస్టులకు ఆదివారం మహిళా డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. ఈ పోస్టులను ఇంటర్నల్ అభ్యర్థులతో భర్తీ చేస్తుండగా, పరీక్షకు 113 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం సామ్యేల్ సుధాకర్ పర్యవేక్షించారు. అధికారులు కే.ప్రసాద్ రావు, పి.వేణుగోపాలరావు, షాకీర్ మొహినుద్దీన్, జాకీర్ హుస్సేన్, ప్రకాశ్‌రావు, నాగేశ్వరరావు, కే.సంతోష్‌కుమార్, చింతల శారద తదితరులు పరీక్షలకు ఏర్పాట్లు చేశారు.

భద్రాచలం అర్బన్: ఏఎస్సార్ కాలనీలో చేరిన వర్షపు నీరు



జూలూరుపాడు: భేతాళపాడు పెద్దవాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



ఇల్లెందు రూరల్: ఉధృతంగా అలుగుపోస్తున్న కొమరారం బందంకుంట



అతలాకుతలం

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉధృతరూపం దాల్చాయి. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. పలుచోట్ల ఇళ్లు నీటమునిగాయి. పలువురు నీటిలో చిక్కుకోగా స్థానికులు, పోలీసులు కాపాడారు. మణుగూరు, కొత్తగూడెం పట్టణాల్లోని ప్రధాన రహదారులపైకి వరద నీరు చేరింది. జిల్లా వ్యాప్తంగా వరద బీభత్సంతో జనజీవనం అతలాకుతలమైంది. –సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లి: సంపత్‌నగర్ శ్మశాన వాటిక సమీపంలో కోతకు గురైన ప్రధాన రహదారి



పాల్వంచ: ఉప్పొంగి ప్రవహిస్తున్న ముర్రేడువాగు



జూలూరుపాడు: పీక్లా తండా, భేతాళపాడు గ్రామాల మధ్య వాగులో వరద ఉధృతి



గుండాల : మర్కోడు-లొద్దిగూడెం మధ్య కోతకు గురైన రోడ్డు



పాల్వంచ రూరల్: రేగులగూడెం వద్ద వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన రోడ్డు



పాల్వంచరూరల్ : బూడిదవాగు ఉప్పొంగి నీట మునిగిన సోములగూడెం రోడ్డు



దుమ్ముగూడెం: నీట మునిగిన పర్ణశాల నారచీరల ప్రాంతం



మణుగూరు టౌన్: వృద్ధురాలిని ఎత్తుకొస్తున్న సీఐ సతీష్‌కుమార్



మణుగూరు టౌన్: నీట మునిగిన సినిమా థియేటర్



చుంచుపల్లి: విద్యానగర్‌లో ప్రధాన రహదారిపై చేరిన వరద నీరు



మణుగూరు టౌన్: వరద ప్రవాహం నుంచి బాలుడిని ఎత్తుకొస్తున్న ఎస్‌ఐ మేడ ప్రసాద్



టేకులపల్లి: రోళ్లపాడు మార్గంలో వాగు ఉధృతి



మణుగూరులో నీట మునిగిన కాంప్లెక్స్

కొట్టుకుపోయిన రింగ్‌బండ్

- గత జూలై 18న పెదవాగు ప్రాజెక్ట్‌కు గండి
- ఆయకట్టుకు సాగునీరందేలా తక్షణ నిర్మాణం..
- భారీ వర్షాలతో అది కూడా కొట్టుకుపోయినవైనం

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఉమ్మడి పెదవాగు ప్రాజెక్ట్‌లో నిర్మాణంలో ఉన్న రింగ్‌బండ్‌కు ఆదివారం తెల్లవారుజామున భారీ గండి పడింది. మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువ ప్రాంతాల్లో ఉన్న పెదవాగు, చిన్నవాగు, కొండవాగులతోపాటు ఏపీలోని బుట్టాయిగూడెం మండలం గుబ్బల మంగమ్మ వాగు నుంచి అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి వద్దనున్న పెదవాగు ప్రాజెక్ట్‌కు వరద నీరు పోటెత్తింది. భారీగా వరదనీరు చేరడంతో రూ.3.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రింగ్‌బండ్ మట్టికట్ట 30 మీటర్ల వరకు కొట్టుకుపోయింది. మరో మీటరు ఎత్తు మేర నిర్మాణం చేపడితే రింగ్‌బండ్ పూర్తయ్యేది. ఈ లోగా కుండపోత వర్షాలతో ప్రాజెక్టులోకి వరదనీరు ముంచెత్తడంతో ఆనవాళ్లు లేకుండా తుడిచిపెట్టుకుపోయింది. కాగా ఎంత మేర నష్టం జరిగిందనే విషయం చెప్పేందుకు నీటిపారుదల శాఖ డీఈఈ మోతీలాల్ నిరాకరించారు.



రింగ్‌బండ్‌కు పడిన భారీ గండి

ఈ సీజన్‌కు సాగునీరు కష్టమే..

భారీ వర్షాలు, వరద పోటుతో పెదవాగు ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టకు గత జూలై 18న భారీ గండి పడింది. దాదాపు 250 మీటర్ల గండి పడటంతో అశ్వారా వుపేట మండలం గుమ్మడవల్లి, కొత్తూరు, నారాయణపురం, అనంతారం గ్రామాలతో పాటు ఏపీలోని వేలేరుపాడు మండలంలో కూడా అపార నష్టం జరిగింది. భారీ గండితోపాటు పలు చోట్ల ఆనకట్ట ధ్వంసం కాగా దాదాపు రూ.150 కోట్ల మేర నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. దీంతో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు స్పందించి ప్రాజెక్ట్ ఆయకట్టులోని తెలంగాణలో ఉన్న 2,300 ఎకరాలకు సాగునీరందేలా చర్యలు చేపట్టారు. రింగ్‌బండ్ నిర్మిస్తుండగా ఆదివారం రాత్రి అది కూడా కొట్టుకుపోయింది. ఇక ఈ సీజన్‌కు సాగునీరు అందనట్లేనని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా 1989లోనూ వరద కారణంగా పెదవాగు ప్రాజెక్ట్ ఆనకట్టకు గండి పడింది.

పశువులను మింగిన పాలవాగు

వరద ఉధృతికి 42 పశువులు మృత్యువాత

బూర్గంపాడు: ఆదివాసీల జీవనాధారాన్ని పాలవాగు పొట్టనబెట్టుకుంది. వరద ఉధృతికి 42 పశువులు మృత్యువాత పడ్డాయి. మండలంలోని కృష్ణసాగర్ గ్రామపంచాయతీ ఉర్లదోసపాడు గ్రామసమీపంలో శనివారం అర్ధరాత్రి ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఉర్లదోసపాడు గ్రామానికి సమీపంలో పాలవాగు ఉధృతంగా పొంగి ప్రవహించింది. వాగు సమీపంలోని దొడ్లలో కట్టివేసిన 42 పశువులు, 2 మేకలు నీట మునిగాయి. పశువులను కట్టేసి ఉంచడంతో ఎటు తప్పించుకోలేని పరిస్థితి నెలకొంది. వరదలో మునిగిపోతున్న పశువులు పెద్దగా అరుస్తుండటంతో, ఆ అరుపులు విని రైతులు అర్ధరాత్రి అక్కడకు చేరుకున్నారు. అయితే అప్పటికే వరద ప్రవాహం పెరిగి పశువుల వద్దకు వెళ్లలేకపోయారు. ఆదివారం తెల్లవారుజాముకు వరద ఉధృతి కొంతమేర తగ్గటంతో రైతులు పశువులు ఉన్న ప్రాంతానికి వెళ్లారు. అప్పటికే 34 ఆవులు, ఎద్దులు, గిత్తలు మృత్యువాత పడ్డాయి. మరో 8 ఆవులు గల్లంతయ్యాయని బాధిత రైతులు చెబుతున్నారు. రెండు మేకలు కూడా మృతిచెందాయి. గ్రామానికి చెందిన గుండి సన్నయ్యకు చెందిన 11 పశువులు, రవ్వ జోగయ్యకు చెందిన 6 పశువులు, సురేష్‌కు చెందిన 3 పశువులు, కోటేశ్వరరావుకు చెందిన 2 పశువులు, కోశయ్యకు చెందిన 4 పశువులు, నందయ్యకు చెందిన 6 పశువులు, దేవయ్యకు చెందిన 4 పశువులు, మంగమ్మకు చెందిన 6 పశువులు మృత్యువాత పడినట్లు గ్రామస్తులు తెలిపారు. తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి ఘటనా ప్రాంతాన్ని సందర్శించి, నష్టం వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వపరంగా సాయమందించేందుకు కృషి చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.



వరద ఉధృతికి మృతి చెందిన పశువులు

వాగులో గల్లంతై ఇద్దరు వృద్ధులు మృతి

200 మేకలు, గొర్రెలు, 30 ఆవులు, ఎద్దుల మృత్యువాత

అశ్వాపురం: భారీ వర్షానికి వాగులో గల్లంతై ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ రైలు గేట్ సమీపంలో కల్లూరి నీలమయ్య, తాటి ఆదెమ్మ గుడిసెల్లో ఉంటూ ఆవులు, మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్నారు. రాత్రి ఆవులు, మేకలు కట్టేసి గుడిసెల్లో పడుకున్నారు. భారీ వర్షానికి వెంకటాపురం వద్ద తోగువాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో వరద నీటిలో అర్ధరాత్రి నీలమయ్య, ఆదెమ్మ గల్లంతయ్యారు. పశువులు కూడా కొట్టుకుపోయాయి. స్థానికులు గాలింపు చేపట్టగా సీఐ అశోక్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు. కల్లూరి నీలమయ్య(68), తాటి ఆదెమ్మ (71) మృతదేహాలు వాగు ప్రవాహంలో చెట్లకు చిక్కుకుని లభించాయి. ఆవులు, ఎద్దులు, మేకలు చనిపోయాయి. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.




కల్లూరి నీలమయ్య మృతదేహం



తాటి ఆదెమ్మ మృతదేహం

కిన్నెరసాని నుంచి భారీగా వరద నీటి విడుదల



కిన్నెరసాని ప్రాజెక్ట్ నుంచి దిగువకు వదులుతున్న వరదనీరు

12 గేట్లు ఎత్తి లక్ష క్యూసెక్కులు దిగువకు..

పాల్వంచరూరల్: భారీ వర్షాలకు కిన్నెరసానిలోకి వరద ఉధృతి కొనసాగుతోంది. జలాశయం నిండుకుండను తలపిస్తోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, 88 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో నీటిమట్టం 405.40 అడుగులకు పెరిగింది. ఫుల్ రిజర్వాయర్ లెవల్‌కు వరద సమీపించడంతో 12 గేట్లు ఎత్తి కిన్నెరసాని నుంచి లక్షా నాలుగు వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రాజెక్ట్ చరిత్రలో ఇది మూడోసారి..

కిన్నెరసాని ప్రాజెక్ట్ చరిత్రలో లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం ఇది మూడోసారి. 1986లో మొత్తం గేట్లను ఎత్తి ఉంచి లక్షా 50 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. 2023లో 12 గేట్లను ఎత్తి వేసి లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తర్వాత ఆదివారమే లక్షా 4 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

చోరీ సొత్తు రికవరీ చేశారు కానీ..

మాకు అప్పగించడం లేదని బాధితుల ఆవేదన

పాల్వంచ: చోరీ కేసుల్లో రికవరీ చేసిన సొత్తును బాధితులకు అందించడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆభరణాలు కోర్టు ద్వారా అందించకుండా నెలన్నర రోజులుగా తిప్పుకుంటున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాల్వంచ పట్టణ పరిధిలో కాంట్రాక్టర్స్ కాలనీ, శివనగర్, అయ్యప్ప నగర్ ప్రాంతాల్లో గత ఏప్రిల్, మే నెలల్లో ఐదు ఇళ్లలో వరుస చోరీలు జరిగాయి. ఈ చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి, గత జూలై నెల 26న సొత్తు రికవరీ చేసినట్లు చూపించారు. అయితే చోరీల్లో భారీ ఎత్తున సొత్తు పోగా, కేవలం 55.67 గ్రాముల బంగారం, 3.155 కేజీల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారని బాధితులు చెబుతున్నారు. సొత్తును కోర్టుకు సమర్పించి సాధ్యమైనంత త్వరగా బాధితులకు అప్పగించాల్సి ఉంది. కానీ పోలీసులు మాత్రం వారికి సొత్తును తిరిగి అందించకుండా స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. కాగా పలు వస్తువులను స్థానిక శాస్త్రి రోడ్‌లోని ఓ బంగారు షాపులో నుంచి తెచ్చి రికవరీ చేసినట్లు ప్రెస్‌మీట్‌లో చూపించినట్లు సమాచారం. ఈ విషయమై డీఎస్పీ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా.. సొత్తు కోర్టు నుంచి లాయర్ ద్వారా తెచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సీఐ వినయ్‌కుమార్‌ను వివరణ కోరగా... వారంలోగా బాధితులకు సొత్తును అందించేలా చూస్తామని, బయటి షాపు నుంచి ఏమీ తేలేదని పేర్కొన్నారు.



రికవరీ చేసినట్లు పోలీసులు చూపిన సొత్తు (ఫైల్)

తొమ్మిది ఆటోలు, టాటా ఏస్ గల్లంతు



ఇసుకవాగు నుంచి ఆటోను ఒడ్డుకు చేర్చుతున్న స్థానికులు

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో ఇసుకవాగులో ఆదివారం గ్రామానికి చెందిన తొమ్మిది ఆటోలు, టాటా ఏస్ వాహనం కొట్టుకుపోయాయి. వాహనాలను శనివారం రాత్రి ఇసుకవాగు ఎగువ ప్రాంతంలో నిలిపి ఉంచారు. అర్ధరాత్రి భారీ వర్షం కురవడంతో వరద ఉధృతికి వాహనాలన్నీ కొట్టుకుపోయాయి. డ్రైవర్లు ఆదివారం గాలింపు చేపట్టగా ఏడు ఆటోలు లభ్యమయ్యాయి. గొందిగూడెంలో పుల్లారెడ్డి, కలిబొయిన సందీప్‌కు చెందిన రెండు ఆటోలు దొరకలేదు. ఎలకలగూడెంలో పాఠశాలలోకి భారీగా వరదనీరు చేరి పాఠశాల ప్రహరీ ధ్వంసమైంది.

వాగులో దిగి.. చెట్టు తొలగించి

కరకగూడెం: రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తుండగా వరద తాకిడికి చిరుమళ్ల బ్రిడ్జి కోతకు గురువుతోంది. బ్రిడ్జి రక్షణకు వాగులో ఏర్పాటు చేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోతున్నాయి. ఈ క్రమంలో తహసీల్దార్ నాగప్రసాద్ ఆదివారం బ్రిడ్జిని సందర్శించారు. తాడు సాయంతో సిబ్బందితోపాటు వాగులోకి దిగి పిల్లర్‌కు అడ్డంగా వరదలో కొట్టుకువచ్చిన తాటి చెట్టును తొలగించారు. దీంతో ఇసుక బస్తాలకు వరద తాకిడి తగ్గింది. కొట్టుకుపోయిన ఇసుక బస్తాల స్థానంలో సిబ్బందితో మళ్లీ ఇసుక బస్తాలు వేయించారు. తహసీల్దార్ స్వయంగా వాగులోకి దిగడాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.



వాగులోకి దిగి చెట్టును తొలగిస్తున్న తహసీల్దార్ నాగప్రసాద్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



పద్మ (ఫైల్)

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. ఎస్ఐ పి.సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని కోయగూడెం పంచాయతీ హనుమాతండాకు చెందిన భూక్య పద్మ (33) కొత్తగూడెంలోని గురుకులంలో చదువుతున్న కుమార్తెను తీసుకుని వస్తోంది. ఇంటికి వెళ్లేందుకు ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో కొత్తగూడెం నుంచి ఇల్లెందు వైపు వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందింది. మృతురాలికి భర్త, కూతురు, కుమారుడు ఉన్నారు.

అనారోగ్యంతో యువకుడి...

సుజాతనగర్: మండల పరిధిలోని నిమ్మలగూడెం గ్రామానికి చెందిన ఉప్పెర్ల అఖిల్(30) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతిపట్ల సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా సంతాపం తెలిపారు. సంతాపం తెలిపినవారిలో మాజీ ఎంపీటీసీ మూడు గణేష్, మాజీ సర్పంచ్ బండి రమేష్, నాయకులు బండి శ్రీనివాసరావు, నాగరాజు, తుంపూరి వీరస్వామి తదితరులు ఉన్నారు.

న్యూవరల్డ్ స్కూల్ కరస్పాండెంట్...

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన న్యూవరల్డ్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. హైదరాబాద్ వెళ్లిన ఆయన, అక్కడ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు సమాచారం. గత కొన్నేళ్లుగా మండల కేంద్రంలో స్కూల్ నడుపుతున్న శ్రీనివాసరావు మృతిపై పలువురు సంతాపం తెలిపారు.